


సాలూరులో నేడు గ్రీవెన్స్

పార్వతీపురం, మక్కువ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను సాలూరులో సమర్పించవచ్చుని, జిల్లా అధికారులంతా హాజరుకావాలని తెలిపారు.

నేడు పోలమాంబ జాతరపై సమీక్ష..ఈవో

శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లపై స్థానిక గుడి వద్ద సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధ్యక్షతన జరుగు సమావేశంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎస్పీ మాధవరెడ్డి పాల్గొననున్నారని, కావున అన్ని శాఖల అధికారులు గ్రామ పెద్దలు హాజరుకావాలని ఆయన కోరారు

తలకిందులైన పాలనాధికారం

ఓడలు బండ్లు.. బండ్లు ఓడలవుతాయనడానికి ఈ ఏడాది చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలే ప్రత్యక్ష తార్కాణం. 2024వ సంవత్సరం రాజకీయంగా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా 1994 నాటి రాజకీయ చరిత్రను టిడిపి మరోసారి తిరగరాసింది. గడిచిన ఐదేళ్లపాటు ప్రజా పోరాటాలపై మోపిన తీవ్ర నిర్బంధాలు, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను, వనరులను కట్టబెట్టడంతోపాటు జనాన్ని మతతత్వంతో రెచ్చగొట్టడం ద్వారా ఏకంగా రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బతీసేందుకు ప్రయత్నించిన బిజెపితో జతకట్టిన వైసిపికి తగిన గుణపాఠం నేర్పారు. దీంతో జిల్లాలో వైసిపి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మన్యం జిల్లాలో సిపిఎంకు ఆదరణ పెరిగింది.

- చరిత్రను తిరగరాసిన 2024
- మూల్యం చెల్లించుకున్న వైసిపి
- అదే బాటలో టిడిపి
- బోణీ కొట్టిన జనసేన
- ప్రజా సమస్యలే అజెండాగా వామపక్షాలు



ఎన్నికల ఫలితాల రోజు విజయానందంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టిడిపి నాయకులు(ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2024 రాజకీయ ముఖచిత్రాన్ని ఒక్కసారి పరిశీలిస్తే మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు అత్యంత కీలకమైనవి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో పది నియోజకవర్గాలు, శ్రీకాకుళం జిల్లా నుంచి కలిసిన మరో రెండు అసెంబ్లీ స్థానాల్లో వైసిపి అడ్రస్ లేకుండా పోయింది. ఆయా 12 స్థానాల్లోని 10 స్థానాల్లో టిడిపి, రెండు స్థానాల్లో జనసేన విజయకేతనం ఎగురవేశాయి. విజయనగరం ఎమ్‌పి స్థానం కూడా టిడిపి ఖాతాలోకి వెళ్లింది. మన్యం జిల్లా పరిధిలో ఉన్న అరకు పార్లమెంట్‌ను మాత్రం వైసిపి పదిలం చేసుకుంది. టిడిపిలో ఎమ్‌పి, ఎమ్మెల్యేలు నూతనంగా ఎన్నికైనవారే ఎక్కువగా ఉన్నారు. సామాజిక తరగతి, రాజకీయాల్లో సీనియర్, మహిళ కావడం వంటివి గుమ్మిడి సంధ్యారాణికి రాష్ట్ర మంత్రివర్గంలో చేరేందుకు కలిసొచ్చాయి. కొండపల్లి శ్రీనివాస్ రాజకీయాల్లో కొత్త అయినప్పటికీ, సామాజిక తరగతి, యువకుడు కావడం వంటి అంశాలు తోడ్పాటును అందించాయి. దీంతో పార్టీలో సీనియర్లు, సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాల నుంచి వచ్చినవారు ఒకింత కంగుతిన్నారు. వీరిలో ఒకరి పనితీరుపై జిల్లాలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరు నెలలు కావస్తున్నా జిల్లాపై పట్టు సాధించలేదని, అటు రాజకీయంగానూ వెనుకబాటు ఉందనే అపవాదును మూటగట్టుకుంటున్నారు.



ఇక జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్‌పిల పనితీరు పరిశీలిస్తే కొత్తదనం ఏమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విజయనగరం ఎమ్‌పి ప్రజా సమస్యలపై ఉన్నతాధికారులకు, పై స్థాయిలో ఉన్న మంత్రులకు వినతులు, విజ్ఞాపనలు ఇవ్వడం తప్ప వాటి పరిష్కారానికి కృషి చేయడం లేదని కూడా చర్చ ప్రారంభమైంది. ఇక పాలన విషయానికి వస్తే గత ఎన్నికల్లో బాదుడే బాదుడు అంటూ నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్తు ఛార్జీలపై విమర్శలు చేసి, ఇప్పుడు అవే భారాలు మోపుతున్నారన్న చర్చ జనంలో ఊపందుకుంది. సూపర్ -6 పథకాలు కూడా ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి మొదలైంది. ప్రజలు పాలనలో కొత్తదనం ఆశించినప్పటికీ ఆ రకమైన ముద్ర పాలకులు వేసుకోలేకపోతున్నారు. ఇక వైసిపి విద్యుత్తు భారాలపైనా, రైతుల సమస్యలపైనా ఇప్పుడిప్పుడే పోరాటం మొదలు పెట్టింది. కానీ, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా, విద్యుత్తు సంస్కరణలు వంటి ప్రభుత్వ విధాన పరమైన విమర్శల వరకు వెళ్లడం లేదు. దీంతో విధానపరమైన అంశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు దొందూ దొందే అన్న చందంగా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. టిడిపి, జనసేన కలిసి రాష్ట్రంలో అధికారంలో చేపట్టినప్పటికీ నాడు వైసిపి అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలే అమలవుతున్నాయి. వైసిపి స్థానంలో వచ్చిన టిడిపి కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తోంది. దీంతో అధికార మార్పిడి జరిగింది తప్ప, పాలనా పరమైన మార్పులేమీ జరగలేదని జనం చర్చించుకునే పరిస్థితి వచ్చింది. మాజీమంత్రి, వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ.. విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికవడం.. ఆ పార్టీ శ్రేణులకు కాస్తా ఊరటగా చెప్పొచ్చు.

చరిత్రలో తొలిసారిగా నెల్లిమర్ల, పాలకొండ నియోజకవర్గాల్లో జనసేన బోణికొట్టింది. సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు సాగుతున్నాయి. మరోవైపు విజయనగరం జిల్లాలో సహా అరకు పార్లమెంట్ పరిధిలో సిపిఎంకు గతంతో పోలిస్తే బలం పెరిగింది. ఇటీవల కాలంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో మహాసభలు జరిగాయి. గత పోరాటాలు, ప్రభుత్వ వైఖరి, ప్రస్తుతం సవాలుగా మారిన ప్రజా సమస్యలు, జిల్లా సమగ్రాభివృద్ధి తదితర అంశాలపై చర్చించుకుని, భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళికలు రూపొందించుకున్నాయి.

అవుట్ సోర్సింగ్ టీచర్ల ఆకలి కేకలు పట్టవా?

- 40 రోజులైనా స్పందించని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి
- సంఘం నాయకులు కలుస్తున్నా దక్కని భరోసా



మంత్రి సంధ్యారాణిని కలిసిన అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె 40రోజులు దాటింది. గిరిజన విద్యార్థుల చదువులు అటకెక్కిన పరిస్థితి ఏర్పడింది. మరో మూడు నెలల్లో పబ్లిక్ పరీక్షలు ఎదుర్కోనున్న విద్యార్థులకు ఇంకా సిలబస్ పూర్తి కాలేదు. గిరిజన విద్య మిథ్యగా మారుతోంది. గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు అర్ధాకలితో అలమటిస్తూ తన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాడుతున్నారు. డిఎస్‌సి నుంచి తమ పోస్టులను మినహాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరి విడనాడాలని ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. మన్యం జిల్లాలో ముగ్గురు గిరిజన ఎమ్మెల్యేలు వున్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు. సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణి గిరిజన సంక్షేమశాఖగా ఉన్నారు. వీరితోపాటు పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ జనసేనలో ఉన్నారు. గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల్లో 80 శాతం మంది గిరిజనులే ఉన్నారు. వీరిలో చాలా మంది ఈ ఉద్యోగాలకు తప్ప మరే ఉద్యోగాలకు అర్హత లేదు. ఇప్పుడు ప్రభుత్వం వారికి ఉద్యోగ భద్రత కల్పించకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రి సంధ్యారాణి కనీస మద్దతు తెలపడం లేదు. వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపి ప్రభుత్వ పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేయడం లేదు. ప్రధానంగా జిల్లా మంత్రి సంధ్యారాణిని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందజేశారు. శనివారం మన్యం జిల్లా సంఘం నాయకులు, ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా సంఘం నాయకులు మంత్రిని కలిశారు. ఎన్నిసార్లు కలిసినా మంత్రి నోట భరోసా ఇచ్చే మాట రావడం లేదు. దీంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు ప్రాధేయపడుతున్నా ప్రభుత్వ పెద్దలకు చీమకుట్టినట్లు కూడా లేదు. దీంతో వారు ఉద్యమ తీవ్రత పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు.



గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గిరిజన సంప్రదాయాలను కాపాడేలా పండగలు

కందికొత్తల ఉత్సవాల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను కాపాడుతూ, మరింత జీవనోపాధి కల్పిస్తూ ఇటువంటి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గిరిజనులకు పిలుపునిచ్చారు. గిరిజన సంప్రదాయ కందికొత్తల పండుగ ఉత్సవాలు గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరితో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఆదివాసీలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయించి, గిరిజన నృత్యాన్ని ఆదివాసీలతో కలిసి చేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల్లేని గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో గిరిజనులు రాణించేలా డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. వీటితో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకునేలా అనేక రకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుమ్మలక్ష్మీపురంలో కౌమార దశలో ఉన్న ఆడపిల్లల కోసం శిక్షణా కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో ఏనుగుల సమస్యకు పరిష్కారం చేయనున్నామని, కంటైనర్ ఆసుపత్రులను రెండు చోట్ల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క సంప్రదాయాన్ని కాపాడుతూ, గిరిజనులకు మరింత జీవనోపాధి కల్పించి, ఈ పండుగల్ని ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, గిరిజనులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ విద్యార్థుల చదువును గమనించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థుల చదువును రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు గమనించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఏడాది వలే ఈ ఏడాదీ పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాను తొలి స్థానంలో నిలపాలని కోరారు. కొద్ది నెలల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ముఖ్యంగా పాఠశాల సమయంలో విద్యార్థులు ఆరుబయట లేకుండా చూడాలని, వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా టీచర్లు చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాక విద్యార్థులు ఇంటి వద్ద చదువును కొనసాగించేలా చూడాలని సూచించారు. అటెండన్స్ 95 శాతానికి తగ్గకుండా ఉండాలని, అకడమిక్ పెర్ఫార్మన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఎంఇఒలకు గ్రేడింగ్ ఇవ్వాలని, టీచర్స్ ఆన్ లైనులో అటెండన్స్ ఉండి, ఫిజికల్‌గా లేకపోతే చర్యలు తీసుకోవాలని డిఇఒను కలెక్టర్ ఆదేశించారు. అవసరం మేరకు విద్యార్థుల ఇళ్లను అప్పుడప్పుడు సందర్శించి ప్రేరణ కల్పించాలని ఆయన సూచించారు. పదో తరగతి తర్వాత ఏ చదువులు చదవాలి, ఎలా సిద్ధం కావాలి వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేస్తూ విద్యపట్ల ఆసక్తి కలిగేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎన్.తిరుపతినాయుడు, ఎంఇఒలు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కో-చైర్మన్ కాంతారావు

కాంట్రాక్టు ఉద్యోగులను ఆదుకోవాలి

ఎపి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్

ప్రజాశక్తి - సాలూరురూరల్

వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులు, కార్మికులకు ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఏఏ హామీలు ఇచ్చారో వాటన్నింటినీ వెంటనే నెరవేర్చి, వారి ఆశలను తీర్చాలని ఎపి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కో- చైర్మన్ బి.కాంతారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ చిరు ఉద్యోగుల సమస్యలపై గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రభుత్వం విధానపరంగా ప్రకటన జారీ చేయలేదని, దీంతో ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 3లక్షల 50వేల మంది సర్వశిక్షాభియాన్, మున్సిపల్, ఇంజనీరింగ్, గిరిజన గురుకులాలు, భాషా వాలంటీర్లు, మెడికల్ విభాగం, ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీరందరికీ సంక్షేమ పథకాలు అందించేలా నిర్ణయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిందని దీన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పిఎఫ్, ఇఎస్ఐకి నోచుకోకుండా అతి తక్కువ చాలీచాలని వేతనాలను ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయన్నారు. ఇలాంటి వారందర్నీ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న గిరిజన గురుకులాల ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత ఉండేలా ప్రభుత్వమే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించి, పెరిగిన ధరలకు తగ్గట్టుగా కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు వేతనాలు కూడా ఏరియర్స్‌తో కలిపి విడుదల చేసేలా నిర్ణయం చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనాలు అమలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు.

సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, సాలూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు టి రాముడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ నాయకులు శంకర్రావు ,శ్రీరామ్, ఆనంద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో బంగారు పతకాల పంట

సత్తాచాటిన సచివాలయం ఉద్యోగి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆరో మాస్టర్స్ అథ్లెట్స్ 30 ప్లస్ వయసు విభాగంలో నిర్వహించిన గేమ్స్‌లో గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గ్రామ సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ నిమ్మక సోమేశ్వరరావు మంచి ప్రతిభ కనబరిచారు. శనివారం, ఆదివారాల్లో జరిగిన 1500 మీటర్లు, 800 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో పాల్గొని తన సత్తాతో బంగారు పతకాలు సాధించారు. సోమేశ్వరరావు స్వగ్రామం చినగీశాడ గ్రామ పంచాయతీ నొండ్రుకొన. విద్యార్థి దశలో ఒకవైపు చదువుతో పాటు మరోవైపు క్రీడలు పట్ల ఎంతో ప్రతిభ కనబరిచేవారు. ఆ స్ఫూర్తే నేటి మాస్టర్స్ అథ్లెట్స్ గేమ్స్‌లో నిరూపణ అయింది. సోమేశ్వరరావు ప్రతిభ పట్ల తోటి సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులు, అధికారులు అభినందించారు.



పరుగు పందెంలో పాల్గొన్న సోమేశ్వరరావు

నేడు చేబియ్యంవలసలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ సచివాలయం పరిధిలోని చేబియ్యంవలసలో ఈనెల 30న రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్య విభాగంలో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్ ట్రేడ్‌ల్లో ఎయిర్‌మెన్‌గా చేరేందుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అదనపు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్‌ల్లో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు శాశ్వతమైన ప్రాతిపదికన నియామకం జరుగుతుందని, పెన్షన్ లభిస్తుందని ఆయన తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యువత రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

ఇంటర్ అర్హతతో మెడికల్ అసిస్టెంట్ ఉద్యోగం

ఈపోస్టుకు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్స్ తో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అన్ని సబ్జెక్టుల్లో సగటున 50శాతం మార్కులు సాధించాలని, అవివాహితులు, 2004 నుంచి 2008 మధ్యలో పుట్టిన అభ్యర్థులు అర్హులన్నారు.

బిఎస్‌సి డిప్లొమా ఫార్మసీతో మెడికల్ అసిస్టెంటు ఉద్యోగం

ఈ పోస్టుకు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్స్‌తో ఉత్తీర్ణులై ఉండాలి. సరాసరి 50 మార్కులు ఉండాలి. అలాగే 50శాతం మార్కులతో బిఎస్‌సి డిప్లొమా ఫార్మసీలో కలిగి ఉండాలి. అవివాహితులు, 2001 నుంచి 2006 మధ్యలో పుట్టిన అభ్యర్థులు, అలాగే పెళ్లి అయిన యువకులు 2001 నుండి 2004 మధ్యలో పుట్టిన అభ్యర్థులు అర్హులు.

ఈ ఎంపిక ఫిజికల్ ఫిట్‌నెస్, రాత, మెడికల్ పరీక్షలు ఉంటాయన్నారు. పై అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు మహరాజస్ కాలేజీ గ్రౌండ్, పి.టీ ఉష రోడ్డు, షీనస్, ఎర్నాకుళం, కొచ్చి, కేరళ - 682011 చిరునామాలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరిగే రిక్రూట్మెంట్ ర్యాలీలో అర్హత కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన అభ్యర్థులు 2025 హాజరు కావచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. వివరాలకు https://airmenselection.cdac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లాలోని పార్వతీపురం నియోజక వర్గం అభ్యర్థులు 9177297528 ఫోన్ నంబరు, పాలకొండ - 7993795796, సాలూరు - 7382559022, కురుపాం - 6303493720 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

పల్లెపండగ పనులకు గ్రహణం

ప్రజాశక్తి - పాలకొండ/వీరఘట్టం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రహదారుల సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పల్లె పండుగ పేరిట రహదారుల పనులకు నిధులు కేటాయించారు. అయితే ఇక్కడ మాత్రం ఆ స్థాయిలో నిధులు కేటాయించలేదు. కేవలం మూడు రహదారులకు మాత్రమే నిధులు కేటాయించారు. అన్ని గ్రామాల్లో రహదారుల సమస్యలు ఉన్నప్పటికీ ప్రతిపాదనలు చేయలేదు. దీంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎరకరాయిపురం, అట్టలి జంక్షన్ నుంచి వాటపాగురోడ్డు, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇన్ని సమస్యలు ఉన్నా పనులు ప్రతిపాదనలు చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



రాళ్లు తేలిన నీలంపేట రోడ్డు

మూడు రోడ్లే


మండలంలో రూ.4 కోట్ల 80 లక్షలతో మూడు రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. విపి రాజుపేట నుండి అర్తలి వరకు అర్తలి రోడ్డు, టికె రాజపురం నుండి తలవరం రోడ్డు, తంపటపల్లి జంక్షన్ నుంచి చింతాడ రహదారులకు నిధులు కేటాయించారు. అందులో ఇప్పటికీ చింతాడ రోడ్డు పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి ఇంతవరకు కాంట్రాక్టరు పనులు ప్రారంభించలేదని తెలుస్తోంది. నిధులున్నా పనులు ప్రారంభించకపోవడంతో అర్తలి రహదారి పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటికి కనీసం 20 శాతం పనులు కూడా జరగలేదు ఎర్త్ పనులు మాత్రమే జరిగాయి. టికె రాజపురం రహదారి పనులు కూడా ప్రారంభమైనప్పటికీ సగం పనులు కూడా జరగలేదు. మందకొడిగా పనులు జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా పనులు జరగడంతో పూర్తిస్థాయిలో పనులు ఎప్పుడు జరుగుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. దీనిపై పట్టించుకోవాల్సిన అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాల్సిందిగా కలెక్టర్ పదేపదే ఆదేశాలు జారీ చేసినా అధికారులకు పట్టడం లేదు.

ఏళ్లు గడుస్తున్నా...

వీరఘట్టం : మండలంలో గ్రామీణ ప్రాంతాల రహదారుల దుస్థితి పరమ అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని కె.ఇచ్ఛాపురం, బల్లగుడ్డి, గదబవలస,

మందకొడిగా సాగుతున్న వైనం

రాయి మానుగూడ, ఎలీసాపురం, నీలంపేట, బట్టిగూడ, కాగితాడ, రామాపురం, పివిఆర్ పురం- డిపి వలస, బిటివాడ -ఎం.వి.పురం, గదబవలస- హుస్సేన్ పురం తదితర గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే రహదారులంతా చిత్తడి చిత్తడిగా మారడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పివిఆర్ పురం- డిపి వలస గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయంలో పనులు ప్రారంభించారు. ఇరువైపులా రహదారిని జెసిబి ద్వారా చదును చేయడంతో పాటు చిప్స్ కూడా వేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఏ విధమైన రహదారి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఈ రెండు గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా దర్శనమిస్తుంది. సీఎస్పీ రహదారి నుంచి యు.వెంకంపేట గ్రామం మీదుగా చిదిమి వరకు కోటి రూపాయలతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పట్లో పనులు ప్రారంభించారు. గత ఐదేళ్ల కాలంలో ఏ విధమైన అభివృద్ధి పనులు జరగకపోవడంతో ఇటీవల కాలంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో యు.వెంకంపేట వరకు సిసి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. యు వెంకంపేట నుంచి చిదిమి వరకు పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తుంది. మూలలంక బిటి రహదారి నుంచి బట్టిగుడ రోడ్డు పనులు చేపట్టేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో రహదారి నిర్మాణ పనులు చేపట్టనప్పటికీ రహదారి అద్వానంగా ఉండడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



పాలకొండ : ఎర్త్ పనులకే పరిమితమైన అర్తలి రోడ్డు

నీలంపేట రోడ్డుకు గ్రహణం వీడేనా

హుస్సేన్ పురం సమీపాన సర్దార్ గౌతులచ్చన్న జలాశయం ఏడో బ్రాంచ్ నుంచి నీలంపేట, ఎలిసిపురం, సంధిమానుగూడ వరకు 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.4.67 కోట్లతో బిటి రహదారి నిర్మించేందుకు అప్పట్లో పనులు చేపట్టారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇక్కడ పనులు పూర్తి కాకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అప్పట్లో వెట్మాస్ వేసి రోలింగ్ చేసి పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో వర్షాలకు రాళ్ల పైకి తేలడంతో వాహనాల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయా ప్రాంతాల గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నీలంపేట గిరిజన గ్రామంతో మిగిలిన గ్రామాలకు రహదారి గ్రహణం వీడేనా అంటూ గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు, స్పందించి గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు 226 మంది హాజరు


ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ గాయత్రీ స్కూల్, కాలేజీ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు 226 మంది విద్యార్థుల హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మోడల్ టెస్ట్‌లో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన వై.కీర్తిక ప్రథమ స్థానం, వీరఘట్టం శ్రీ గాయత్రి స్కూల్, కళాశాలకు చెందిన ఆర్.కేతన్, కోటబొమ్మాళిఇ యోందిర వి.వినీత్ ద్వితీయ స్థానం, పొందూరు మండలంలోని గాయత్రి స్కూల్‌కు చెందిన జి,కేశవ, జి.శిగడాంకు చెందిన ఎన్.నివేదిత తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి యుటిఎఫ్ మండల శాఖ బహుమతులు అందజేసింది. అలాగే ఈ పరీక్షల్లో మొదటి 30 స్థానాల్లో పొందిన 33 మంది విద్యార్థులకు జనవరి 12న వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవోదయ ఫైనల్ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా, మండల బాధ్యులు మజ్జి పైడిరాజు, కురమాన గోవిందరావు, బోనంగి దుర్గ ప్రసాద్, మహేష్, గౌర్నాయుడు, స్వామిబాబు, సూర్య ప్రకాష్, అన్నాజీరావు, వాసుదేవరావు, ముకుందరావు, రాంబాబు, చంద్రమోహన్, రాజేష్, గోవిందరావు, సింహాచలం, వెంకటరమణ, గణేష్ ,రవీంద్ర, నరసింగరావు, తదితరులు, పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించినటుల గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య జీవిత చరిత్ర విద్యార్థి చదవగా విద్యార్థులు విన్నారు. క్విజ్, పాటల పోటీలు, పద్యాలు, గద్యాలతో పాటుగా క్యారం బోర్డు, చదరంగం, కబాడీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 28 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం అలమండ పంచాయితీ, అప్పన్నదొరవలసకు చెందిన ఏలూరు మధుమతి బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడుతున్న కారణంగా కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సిఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ మేరకు సిఎం సహాయనిధి నుంచి రూ.2,76,279ను బాధిత కుటుంబానికి మంజూరు చేయించారు. ఆ చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎం.సత్యంనాయుడు, కురుపాం నియోజకవర్గ వెలమ సాధికారసమితి అధ్యక్షులు రెడ్డి బలరామస్వామి, తెలుగు రైతు కురుపాం నియోజకవర్గం అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తినాయుడు, కురుపాం నియోజకవర్గం తూర్పుకాపు సాధికార సమితి అధ్యక్షులు లంక గోపాలం, వైస్ ఎంపిపి బిడ్డిక నరేష్, టిడిపి సీనియర్ నాయకులు పూడి సీతారాం , దాసరి రామారావు, సర్పంచ్ ఊయక మన్మధ ఉన్నారు.



గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎస్ సొసైటీ కార్యదర్శి, ఎంపిటిసి సభ్యులు

గిరిజన మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉసకొండ పంచాయతీలో గల పలు గిరిజన గ్రామాల మహిళలకు ఎస్ సొసైటీ కార్యదర్శి ఎస్‌కె గౌస్ ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ఈ చీరలను వందమంది పేద గిరిజన మహిళలకు వితరణగా అందజేశామని తెలిపారు. విశాఖ పట్టణానికి చెందిన బ్యాంక్ ఉద్యోగి నగేష్, వారి మిత్రుల సహకారంతో మారుమూల గ్రామాల్లోని గిరిజనులకు చీరలు పంపిణీ చేశామని అన్నారు. ఇంకెవరైనా దాతలు ముందుకొచ్చి చీరలు, బట్టలు, దుప్పట్లు అందిస్తే మారుమూల గ్రామాల్లోని వృద్ధులకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు అడ్డమేశ్వరరావు, సవర భాష వాలంటీర్ లక్ష్మయ్య తదితరువులు పాల్గొన్నారు.

120 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని కృష్ణపల్లి సరిహద్దు వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్నట్టు దేవుపల్లి అజయ్, సుభాష్‌లను అదుపు లోనికి తీసుకొని 120 లీటర్ల నాటు సారా, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం పార్వతీపురం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ వారికి అప్పగించారు. దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ సిహెచ్ రాజశ్రీ, హెచ్‌సి కె.రాంబాబు, కానిస్టేబుళ్లు రాము, మనోజ్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలి : సిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కానిస్టేబుల్ పరీక్షకు సిద్ధమవుతున్న ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలని ఎల్విన్‌పేట సిఐ హరి అన్నారు. ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ పరిధిలో 44 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ పరీక్షలకు వెళ్తున్న వారికి శిక్షణపై అవగాహన కల్పించారు. గమ్యాన్ని చేరుకోవాలంటే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. సొంత నిధులతో టీ షర్ట్స్, ట్రాక్ ఫ్యాంట్, షూలు అభ్యర్థులకు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివప్రసాద్, నారాయణరావు, నీలకంఠరావు, సిబ్బంది ఉన్నారు.



అభ్యర్థులకు స్పోర్ట్ కిట్‌ను అందజేస్తున్న సిఐ హరి, ఎస్ఐలు

జలం రాని జలజీవన్

● చుక్కనీరివ్వని ఇంటింటి కుళాయి ●ఎదురుచూస్తున్న గిరిజనం
●కాంట్రాక్టరు నిర్లక్ష్యం.. అధికారుల తాత్సారం

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గాన్ని తాగునీటి సమస్య వెంటాడుతోంది. గ్రామ ప్రజలకు తాగునీరందించేందుకు కేంద్రప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి కుళాయిలు పథకం అయిన జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో పనులు ప్రారంభమైనప్పటికీ ప్రజలకు చుక్కనీరందని పరిస్థితి నియోజకవర్గంలో చోటు చేసుకుంది. వైసిపి హయాంలో 2023 మార్చిలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరందించాలనే ఉద్దేశం పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. ఈ ఏడాది మార్చి నాటికి కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయాలి. అయితే ఎక్కడా పూర్తి కాలేదు. జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గానికి రూ.10,779.08 లక్షలతో 505 పనులు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 154 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 223 పనులు ప్రగతిలో ఉండగా, 128 పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. నాలుగు మండలాల వారీగా చూస్తే పాలకొండలో రూ.839.41లక్షలతో 48 పనులు మంజూరు కాగా, 11 పూర్తియ్యాయి. 21 ప్రగతిలో ఉండగా, 13 పనులు ఇంకా ప్రారంభించలేదు. అలాగే వీరఘట్టం మండలానికి రూ.773.79లక్షలతో 53 పనులు మంజూరు కాగా, కేవలం ఆరు పనులు ప్రారంభమే పూర్తయ్యాయి. 38 పనులు ప్రగతిలో ఉండగా, ఇంకా 9పనులు ప్రారంభించలేదు. సీతంపేట మండలానికి రూ.1659.15లక్షలతో 326 పనులు మంజూరు కాగా, 120 పనులు పూర్తయ్యి, 112 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇంకా 12 పనులు ప్రారంభం కాలేదు. అలాగే భామిని మండలానికి రూ.7506.73లక్షలతో 78 పనులు మంజూరు కాగా, 14 పనులు పూర్తయ్యాయి. 52 పనులు ఇంకా నిర్మాణ దశలో ఉంగా, 12 పనులు ఇంకా ప్రారంభించలేదు. పనులు ప్రారంభమైన రెండో ఏడాది కావస్తున్నా పూర్తి కాకపోవడానికి కారణం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారులు తాత్సార్యమేనని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.

ఇలా నియోజకవర్గంలో అరకొరగా పనులు చేపట్టడంలో ప్రజలకు తాగునీరు అందని ద్రాక్షలా మారింది. ఈ సమస్య సీతంపేట ఏజెన్సీలో మరింతలో ఎక్కువగా ఉంది. మండలంలోని నెలిగండిలో అండర్‌గ్రౌండ్ పైపులు వేసి విడిచిపెట్టేశారు. సీతంపేటలోని పలు వీధుల్లో ట్యాపులు బిగించి నీరివ్వలేదు. ఇలా పలుగ్రామాల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో వర్షాకాలంలోనూ పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో ఇక్కడ గిరిజనులు ఊట బావులు, చెలమలు, గెడ్డలపైనే ఆధారపడుతున్నారు. బావులు ఉన్నా కొండలపై ఉండడంతో ఎక్కువగా లోతు తవ్వడం కుదరదు. దీంతో ఈ బావులు త్వరగా అడుగంటి పోతున్నాయి. రిగ్గు బోర్లు కొట్టినా రాళ్ల తగలడంతో ఎక్కువ లోతుకు వెళ్లకపోవడం, రాళ్ల పడడంతో నీరు రావడం లేదు. అయితే తాగునీరందించాలని గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కొళాయి ఏర్పాటు చేసినప్పటికీ ఏడాది కావస్తున్నా ఆ పనులు పూర్తిగా కాకపోవడానికి కారణం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారులు తాత్సారమేనని ఆ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. పలు గ్రామాల్లో పైపులు వేసి ట్యాపులు బిగించినప్పటికీ నీరు సరఫరా కాకపోవడంతో అవి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఏడాదిగా గిరిజనులు ఎప్పుడు కుళాయి ద్వారా నీరొస్తుందోనని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. వంశధార నీరు పైపుల ద్వారా తాగునీరందించడంతో పాటు అవసరమైన చోట రిగ్గు బోర్లు కొట్టి నీరు అందించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అంతవరకు బాగానే ఉంది. అయితే కాంట్రాక్టర్ గ్రామాల్లో అండర్ గ్రౌండ్‌లో పైపులైను వేసి వదిలేశారు. ఏడాది కావస్తున్నా సగం పనులు కూడా పూర్తి చేయలేదు. **తవ్వ కాలకే పరిమితమా..?**

వీరఘట్టం: లక్షలాది రూపాయలు వెచ్చించి జల జీవన్ మిషన్ ద్వారా పలు గ్రామాల్లో పనులు చేపట్టారు. అయినా ఎక్కడికక్కడే తవ్వకాలు జరిపి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో పాటు బోరుబావు తవ్వకాలు కూడా జరిపారు. అయితే ఇవి గ్రామాల్లో ఉత్సహ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. మండలంలో కడకెల్ల, విక్రాంపురం, చిదిమి, చేబియ్యంవలస, దశమంతపురం, చినగోరకాలనీ, యు.వెంకంపేట, బూరుగ, తదితర గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద పనులు చేపట్టడంతో ఆ గ్రామస్తులు తాగునీటి కష్టాలు తప్పుతాయని సంబరపడ్డారు. అయితే అధికారుల అలసత్వం వల్ల తమ ఆశలపై నీళ్ల చల్లినట్లయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా జలజీవన్ మిషన్ పథకం ద్వారా కుళాయి పాయింట్ల ద్వారా నీరు వచ్చేది ఎప్పుడోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేసి వాటి ద్వారా తాగునీరచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సీతంపేటలో నిరుపయోగంగా ఉన్న ట్యాప్‌లు

పైపులు వేసి వదిలేశారు



మా గ్రామంలో పైపులు లేసి వదిలేశారు. కొళాయి ఎప్పుడిస్తారని అధికారులకు అడుగుతున్నాం. రానున్న వేసవికి ఉన్న బావుల్లో నీరు అడుగంటి పోతుంది. దీంతో నీటి కొరత ఏర్పడుతుంది. ఇంటింటి కుళాయి ట్యాపులు ఎప్పుడు బిగిస్తారా అని ఎదురుచూస్తున్నాం.

మాండంగి కాంతారావు, నెల్లిగండి గ్రామం



వీరఘట్టం : కడికెల్లలో నిరుపయోగంగా ఉన్న బోరు

కాలపరిమితి పెంచాం



జలజీవన్ మిషన్ ద్వారా నిర్వహిస్తున్న ఇంటింటి కొళాయి పనులు కాంట్రాక్ట్ కాలపరిమితి మరో ఆరు నెలలు గడువు పెంచాం. జూన్ నాటికి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్.సత్యం, ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్, సీతంపేట.

కాంపేక్టర్ హైడ్రాలిక్ మున్సిపాలిటీకి చేరేనా?

ఒకే వాహనంతో చెత్త తరలింపునకు అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగానికి చెందిన కాంపేక్టర్ హైడ్రాలిక్ వాహనం మరమ్మతుల కోసం తీసుకువెళ్లి 11 నెలలైనా కార్యాలయానికి రాకపోవడమేమిటని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో గల 30 వార్డుల్లో చెత్త సేకరణకు ఏర్పాటు చేసే కాంపేక్టర్ బిన్‌ల్లో ఉన్న చెత్త, వ్యర్థాలను కాంపేక్టర్ వాహనం ద్వారా తరలించేందుకు ఉన్న రెండు వాహనాల్లో ఒక వాహనం మరమ్మతుల కోసం విశాఖ తరలించారు. మరో కాంపేక్టర్ హైడ్రాలిక్ వాహనం మరమ్మతుకు గురైంది. అప్పటి కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంచనాలకు మించి టెండర్ పిలిచారనే విమర్శలు మున్సిపల్ కార్యాలయంలో వినబడుతున్నాయి. విశాఖకు చెందిన మెకానిక్ టెండరు వేసి ఆ వాహనానికి మరమ్మతులు పూర్తి చేసి 11 నెలలైనా మున్సిపల్ కార్యాలయానికి అప్పజెప్పకపోయినప్పటికీ ఆ వాహనాన్ని అధికారులు వెనక్కు రప్పించకపోవడానికి ఆసక్తి చూపించకపోవడం వెనుక పలు అనుమానాలకు తావిస్తూ మున్సిపల్ కార్యాలయానికి చెరదేమో అన్నట్లుగా ఉంది. ఉన్న ఒక్క కాంపేక్టర్ హైడ్రాలిక్ వాహనంతో చెత్తలు, వ్యర్థాలు డంపింగ్ యార్డుకు తరలింపు భారమవుతుందని పారిశుధ్య కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు టెండరు దక్కించుకున్న టెండరుదారు ఒప్పందం మేరకు తనకు అందాల్సిన బిల్లు ఇంతవరకు అందకపోవడంతోనే వాహనాన్ని తన షెడ్‌లో ఉంచినట్లు చెపుతున్నాడని ఇంజనీరింగ్ అధికారులు చెబుతుండడం విశేషం. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, ప్రజారోగ్య విభాగం అధికారి ఈ వాహనాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టి పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చెత్తను తరలిస్తున్న పట్టణంలో గల ఒకే ఒక కాంప్టేక్టర్ హైడ్రాలిక్ వాహనం

పర్యాటక ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

ప్రతిరోజూ క్షణం తీరిక లేక బిజీగా కాలం గడుపుతున్న జిల్లా పరిపాలన అధికారి ఆదివారం సెలవు దినం కావడంతో తన కుటుంబ సభ్యులతో సీతంపేట పర్యాటక ప్రాంతాన్ని సందర్శించి కాసేపు అందాలను ఆస్వాదిస్తూ సేద తీరారు. ఆడలి వ్యూ పాయింట్, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, బెనరాయి జలపాతాలను సందర్శించారు. ఎన్టీఆర్ అడ్వాంచర్ పార్క్‌లో పలు సాహస క్రీడలను ఎంజాయ్ చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జి, నడిచి వెళ్లారు ఆర్చరీ, విలువిద్య ఎక్కుపెట్టారు. షూటింగ్, గన్ షాట్ చేశారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా...

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా నృత్యాలు వేశారు. పార్కులో పర్యాటకులు సండే సందడి చేశారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. 5డి థియేటర్‌లో చిత్రాలను వీక్షించారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ఆడలి యు పాయింట్ సందర్శించి మైమరిపించే ప్రకృతి అందాలను తిలకించారు.




హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచివెళ్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నిర్లక్ష్య డ్రైవింగ్‌తో భయపెడుతున్న యువత

పోలీసులు దృష్టి పెట్టాలని స్థానికులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారిలో మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లేని యువత, ఆకతాయిగా తమ ద్విచక్ర వాహనాలతో ఎక్కువ సౌండ్ వచ్చేలా రైజింగ్ చేస్తూ స్పీడుగా శబ్ద కాలుష్యం చేస్తూ రేష్ డ్రైవింగ్‌తో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించి ప్రజలను, వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నారు. వీరు చేస్తున్న రేష్ డ్రైవింగ్ వల్ల ఎప్పుడు ఏ విధమైన ప్రమాదాలకు గురవ్వాల్సి వస్తుందోనన్న భయంతో రహదారిపై స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా వాసవి, గాయత్రి కళాశాల, ప్రభుత్వ జూనియర్, భాస్కర్, వేదాంత ఆర్కే కళాశాలలకు విద్యార్థినీ, విద్యార్థులు వెళ్తూ, వచ్చే సమయాల్లో యువత మరింత రెచ్చిపోయి తమ వాహనాలను శబ్ద కాలుష్యం చేస్తూ అత్యంత వేగంగా నడుపుతూ భయాందోళనకు గురి చేస్తున్నారు. అయినా పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానిక ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. దీంతో పట్టణంలో తిరుగుతున్న పలు ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకుండానే తిరుగుతున్నా అటు పోలీసులు గానీ, కానీ ఇటు జిల్లా మోటార్ వెహికల్ అధికారులు కానీ దృష్టిసారించడంలేదన్న విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ఇరు శాఖల ఉన్నతాధికారులు దృష్టి పెట్టి రేష్ డ్రైవింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మితిమీరిన వేగంలో వెళ్తున్న యువత (వృత్తంలో)

వేస్ట్ మెటీరియల్ అంశంపై గురుకుల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో వేస్ట్ మెటీరియల్ అంశంపై గురుకుల విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి మండంగి సంతోష్ రీసైక్లింగ్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్ అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్‌లో జిల్లా స్థాయి పోటీల్లో రెండో స్థానం లభించినట్లు తెలిపారు. విజయవాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నాడని తెలిపారు. జనరల్ విద్యార్థులతో పోటీపడి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక కావడంపై ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ విద్యార్థి సంతోష్‌ను, ప్రోత్సహించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అభినందించారు.

పైప్‌లైన్ పనులు పరిశీలించిన చైర్మన్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగరపంచాయతీ పరిధిలో గల గారమ్మ కాలనీ దగ్గర జరుగుతున్న తాగునీటి పైప్ లైన్ పనులను ఆదివారం నగరపంచాయితీ చైర్మన్ పల్లా ప్రతాప్ పరిశీలించారు. పనులు వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యలు రాకుండా ముందే గుర్తించాలని అన్నారు.

విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి - మక్కువ



మండలంలోని కాశీ పట్నం పంచాయతీ పరిధిలోని కొండరేజేరుకు చెందిన ఇంటర్ చదువుతున్న వాకాడ హర్ష అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ మేరకు ఆదివారం మక్కువ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడ హర్ష తల్లిదండ్రులు పైడపునాయడు, జ్యోతి మాట్లాడుతూ బొబ్బిలి ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తమ కుమారుడు ఈనెల 23న కాలేజీకి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. అయితే అక్కడ కాలేజీకి రాలేదని స్నేహితుల ద్వారా తెలుసుకున్నామన్నారు. కాలేజీలో విచారించగా హర్ష రాలేదని యాజమాన్యం తెలిపింది. ఎక్కడికి వెళ్లాడనేది తమకు తెలియదని, గతంలో కళాశాలకు వెళ్లేటప్పుడు రెండు రోజుల తర్వాత ఇంటికి సమాచారం కూడా ఇచ్చేవాడని, ఈసారి అలా ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తిరుపతిరావు

నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో అర్థాంతరంగా నిలిచిపోయిన వంద పడకల సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిని వెంటనే నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, నాయకులు ఎ.భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులు, విద్యార్థులు అనారోగ్యానికి గురై మరణాలు సంభవిస్తున్నా గిరిజన మంత్రికి పట్టకపోవడంతో దారుణమన్నారు. అలాగే ఖాళీగా ఉన్న హెల్త్ ఆసిస్టెంట్ల నియామకం చేపట్టాలని గానీ, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచన చేయడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 6 నెలలు కావస్తున్నా ఐటిడిఎల పరిధిలో నిర్వహించాల్సి గవర్నింగ్ బాడీ సమావేశం లేకపోవడం వారికి గిరిజనుల పట్ల ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తక్షణమే పాలకవర్గ సమావేశం నిర్వహించి గిరిజన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ధారపాడు సర్పంచ్ జి.సుందరమ్మ, సిపిఎం నాయకులు పాలక సాంబయ్య పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక బోధన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం ప్రత్యేక బోధన చేయనున్నట్లు పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, పెద్దబొండపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అమరాపు సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు పెద్ద బొండపల్లి ఉన్నత పాఠశాలలో తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు సంసిద్ధం చేయడానికి సెలవుల్లో కూడా బోధన ఉపయోగపడుతుందని గణిత ఉపాధ్యాయులు పాలకొల్లు రామలింగ స్వామి, అమరపు సూర్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు చొక్కాపు జనార్ధనరావు అన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు సాయంత్రం 4గంటల నుండి 5 గంటల వరకు అదనంగా బోధించడం వల్ల వెనుకబడిన విద్యార్థులకు మేలు జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుని గౌరి తెలిపారు. ఉపాధ్యాయుల శ్రమతో పాటు తల్లిదండ్రుల శ్రద్ధ ఉన్నట్లయితే విద్యార్థులు మంచి ప్రగతి కనిపిస్తారని ఉపాధ్యాయులు తెలిపారు.

డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధి ఉమ్మడి జిల్లాలో గల సంక్షేమ వసతి గృహాలకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ కోరారు. గత మూడు నుంచి ఐదు నెలల వరకు డైట్ బిల్లు లేక వసతి గృహ సంరక్షకులు, సిబ్బందులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వసతి గృహాలను నడపాలన్నా, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెట్టాలన్నా ఇబ్బంది తప్పడం లేదన్నారు. టెండర్ల నుంచి నిత్యావసర సరుకులు అప్పులు తెచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, ధరలు పెరగడంతో సరుకులు కొనుగోలు చేయలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

'నా వార్డులో కాలువలను నేనే శుభ్రం చేస్తా'

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 29వ వార్డు రామాపురం కాలనీలో పలు వీధుల్లో గల మురుగు కాలువల్లో చెత్తలు, వ్యర్థాలు పేరుకుపోయి నివాస గృహాల ద్వారా వస్తున్న వాడుక నీరు, మురుగు కాలువలో చేరి ప్రవహించేందుకు వీలు లేకుండా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ వార్డు వైసిపి కౌన్సిలర్ ఎడ్ల త్రినాథ్ పలుమార్లు ఈ సమస్యను మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారానికి ఆ శాఖ అధికారులు దృష్టిసారించలేదు. దీంతో ఆయన ఆదివారం నా వార్డులో ఉన్న కాలువలను నేనే శుభ్రం చేసుకుంటానని స్వయంగా తానే కాలువలపై ఉన్న పలకలను తీసి కాలువలను శుభ్రం చేశారు. మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు చెబితేనే సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆ వార్డు ప్రజలు బహిరంగంగానే మున్సిపాలిటీ అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.



కాలువపై పలకలు తొలగిస్తున్న కౌన్సిలర్